541) ముఖారి

ప॥ కప్పురము దిన్ననోట గార మేలే। యిప్పుడే కంటిమి వేసాలిక నేలే॥

చ॥ కాంతుడు వద్దికి వచ్చి కన్నులెదుట నున్నాడు। చింతలెల్ల దీరినాను సిగ్గులేలే।
మంతనాన మాటలాడగా మరగులే పెట్టేవు। వంతవరుసలు వచ్చె వాసులేలే॥

చ॥ మక్కువ చల్లి యీతడు మనసెల్ల నిచ్చినాడు। మొక్కలము దీరినాను మోనమేలే।
లక్కవలె గరగీ నీలాగులెల్లా జూచి చూచి। చక్కనాయ బనులెల్లా జాగులేలే॥

చ॥ శ్రీవేంకటేశ్వరుడు చేరి నిన్ను గూడినాను। వావులు గలసె తలవంచ నేలే।
వేవేలు వచ్చె నీకు విభుడాతడైనాడు। కైవశమైన మీద కతలేలే॥